RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 18 Issue No. 4 Monthly April 2021 ISSN No. : 2456-4702 Rs. : 15/-



## శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | ముదిగొండ శివప్రసాద్-చారిత్రక నవలలు-జాతీయ భావనలు | - బి. క్యాథరీన | 5 |
| 2. | శ్రీ పోతుల హన్మంతరెడ్డి భీమార్జున విజయాలు (నాటకం) | - డా॥. సి. నర్సింహులు | 10 |
| 3. | తెలుగులో చారిత్రక నవల | - డా॥. శిరీష ఈడ్పుగంటి | 13 |
| 4. | ఆధునిక తెలుగు కవిత్వం దారులు : పరిధుల పరిశీలన | - డా॥. గోనిపాటి ధర్మారావు | 16 |
| 5. | ఉనికి కోల్పోతున్న ఉపకులాలు - క్షీణిస్తున్న ప్రదర్శన | - డా॥. కొత్తిరెడ్డి మల్లారెడ్డి | 22 |
| 6. | కవిత్వమే కాదు.. కథనూ కొత్తకోణంలో చూపిన తిలక్ | - డా॥. ఎం. హరికృష్ణ | 28 |
| 7. | సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం - బంజారాలు | - డా॥. మూడే నాగేంద్ర నాయక్ | 32 |
| 8. | ప్రయోగాలకు వాకిలి - శ్రీశ్రీ సిప్రాలి | - డా॥. ఎన్. ఈశ్వర రెడ్డి | 37 |
| 9. | తెరచిన కళ్ళు నాటికలోని పాత్రలు మనో విశ్లేషణ | - డా॥. పెరుగుపల్లి బలరామ్ | 43 |
| 10. | చర్లపల్లి కట్టమైసమ్మ పండుగ - వైశిష్టత | - ఏర్పుల నరసింహ | 48 |
| 11. | స్త్రీవాదంలో 'ఓల్గా ' | - గాండ్ల విజయకుమారి | 53 |
| 12. | శ్రీరామ నవమి విశిష్టత | - కాపర్తి స్వరాజ్యం | 66 |
| 13. | భీష్ముడు - యుద్ధ వ్యూహాలు | - కుమ్మరి రాజు | 60 |
| 14. | కవిత్రయ మహాభారతంలో కర్ణుడు | - శ్రీ పట్ర నరసింహులు | 67 |
| 15. | తెలుగు దినపత్రికలు - సాహిత్యసేవ | - దారిశెట్టి లక్ష్మీనరసింహం | 71 |
| 16. | ఆధునిక తెలుగు స్త్రీవాద కవిత్వం-నిషిద్ధాక్షరి ఒక పరిశీలన | - డా॥. పల్లా కృష్ణ | 74 |
| 17. | అప్పల్నాయుని కథల్లో రైతు జీవితం | - ఆచార్య కె. శ్రీదేవి & చంద్రబాబు | 80 |
| 18. | రవీంద్రనాథ్ టాగూర్ - ధర్మకర్త కథ - మానవీయ కోణంలో విశ్లేషణ | - కోనేటి శశికళ | 85 |
| 19. | కంచికి చేరని కథ నవలలోని సామాజిక స్పృహ - పరిశీలన | - తమ్మన నాగవెంకట హరిబాబు & డా॥. కె. బలరామ్ | 90 |
| 20. | సినారె కవిత - తాత్వికత దృక్పథం | - సి.హెచ్.నాగలక్ష్మి | 93 |
| 21. | ఎల్లి నవల : సంస్కృతి-మానవ హక్కుల మధ్య సంఘర్షణ | - డా॥. వెంకటరామయ్య గంపా | 98 |
| 22. | తెలుగు కథా ప్రక్రియకు పునాది - భండారు అచ్చమాంబ | - డా॥. పడాల జగన్నాథరావు | 104 |
| 23. | చైనా దేశపు 'కాల విజేత' | - డా॥. వెల్దండి శ్రీధర్ | 109 |
| 24. | సీతా సంసేవితం 'త్రిజట' స్వప్నం | - డా॥. వి. త్రివేణి | 113 |
| 25. | స్త్రీ ఆత్మగౌరవ ప్రదర్శిక 'కన్నతల్లి' | - ఆచార్య కొలకలూరి మధుజ్యోతి | 120 |
| 26. | ఎలక్ట్రానిక్ మాధ్యమాలు - తెలుగు భాషా వైవిధ్యం | - డా॥. బాశెట్టి లత | 125 |
| 27. | పాకుడురాళ్ళు నవలా ప్రాశస్త్యం | - నక్కా శ్రీనివాసరావు | 130 |
| 28. | విశ్వనాథ సత్యనారాయణ - రచన వైశిష్ట్యం | - డా॥. బూసి వెంకటస్వామి | 133 |
| 29. | A Study of Analysis in Girish Karnad's The Play... | - Dr. Kotaiah Veturi | 137 |
| 30. | Pawan Kalyan's Political Journey | - S Swaroop Sirapangi | 142 |
| 31. | A Study of Gujarati Trading Community ... | - Mary Varghese & Sebastian Joseph | 150 |
| 32. | A Survey Analysis on the Impact of Social Media.. | - Dr. Battu Kiritam | 158 |

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఆధునిక తెలుగు స్త్రీవాద కవిత్వం – నిషిద్ధాక్షరి ఒక పరిశీలన

– డా॥. పల్లె కృష్ణ, తెలుగు అధ్యాపకులు, CSSR & SRRM డిగ్రీ & పీ.జీ. కళాశాల, కమలాపురం, కడప జిల్లా.

## ఆధునిక తెలుగు కవిత్వం :

నేటి కాలంలో ఆధునిక సాహిత్య ప్రక్రియలు అనేకం పుట్టుకు వచ్చాయి, ఇంకా వస్తూనే ఉన్నాయి. వినూత్న భావజాలంతో కవులు, రచయితలు వివిధ కోణాల్లో సాహిత్యాన్ని ముందుకు నడిపిస్తున్నారు. ముఖ్యంగా ఆధునిక కవిత్వం వివిధ రకాల ఉద్యమాలను, వాదాలను శక్తివంతం చేసి ప్రజలను చైతన్య పర్చడంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుందనవచ్చు.

ఆధునిక కవిత్వం మనుషుల మస్తిష్కంలో మరువ కూడని మానవీయ విషయాలను ఎన్నింటినో తట్టి నిద్రలేపి, ఇది వరకటి మనిషి మూఢ సంప్రదాయాలతో తన చుట్టూ బిగించుకున్న వివిధ రకాల బంధనాలను చేదించుకుని వర్తమాన ఆలోచనాధారతో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టేలాచేసింది. ఒక అంశాన్ని పలు కోణాల్లో భిన్నధోరణులతో ప్రకాశించేయడం నేర్పి, ఆధునిక కవిత్వానికి ఉన్న అనంత శక్తిని పరిచయం చేసిందనవచ్చు. ఈనాడు ఇంత విస్తృతంగా కవిత్వంలో మార్పులు రావడానికి మార్గం సుగమం చేసింది ఆధునిక కవిత్వమే.

నేడు శాఖోపశాఖలుగా విస్తరిస్తూ పలు ఉద్యమాలకు, వాదాలకు జీవంపోస్తున్న ఆధునిక కవిత్వం సమాజంలో మార్పుతీసుకురావడానికి, సమాజాన్ని ప్రగతివైపు పయ నింపచేయడానికి దోహదపడుతోందనవచ్చు. ఆధునిక తెలుగు సాహిత్యంలో భావవాదం, అభ్యుదయవాదం, విప్లవవాదం, దిగంబర, పైగంబర వాదాలు, స్త్రీ, దళిత, మైనారిటీ, బహుజనవాదం వంటి ఎన్నో వాదాలకు ఆధు నిక కవిత్వం ఒక నిర్దుష్టతను అందించింది.

## స్త్రీవాద కవిత్వం :

ఆధునిక కవిత్వంలో స్త్రీవాద కవిత్వం 1980 ప్రాంతం నుంచి వస్తూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఎన్ని ఉద్యమాలు వచ్చినా ఆ ఉద్యమాల ప్రభావంతో స్త్రీల దైనందిన జీవనశైలిలో మార్పురానందున స్త్రీలకోసం, స్త్రీలచేత ఆవిర్భవించిందే స్త్రీవాద కవిత్వం. ఆది నుంచి సమాజంలో మగవారికి తోడుగా నడిచిన స్త్రీని - తక్కువగా చూడడం, చూపడం జరిగిందనవచ్చు. అన్నింటికీ ఆడది కావాలి కానీ ఆధిపత్యం మాత్రం మగవాడిదే అనే కోణంలో నుంచి జ్వలిస్తూ, జనించిందే స్త్రీవాద కవిత్వం.

స్త్రీలను తరతరాలుగా తమ సంకుచిత ఆలోచనా విధానాలతో బంధించడం వల్ల, స్పష్టంగా చెప్పాలంటే వారిని వంటింటికే పరిమితం చేయడం, ఆపాదమస్తకం సంప్రదాయ శృంఖలాలతో బంధించడం జగమెరిగిన సత్యం. సృష్టిలో స్త్రీ పురుషులు ఇరువురూ సమానమైన సమాజం మాత్రం స్త్రీలకు సర్వత్రా దు:ఖాన్నే అధికంగా అందించింది.

సమస్త మానవ జీవితాన్ని నిశితంగా పరిశీలిస్తే కొందరు పురుషులకు ఉన్న దుష్టగుణ స్వభావంచే స్త్రీలు ఎక్కువగా బాధింపబడ్డారనవచ్చు. పురుషులు చెడువైపు అడుగులు వేసే ప్రతిసారి అంతిమంగా స్త్రీలే నరకం అనుభవిస్తున్నారని తెలుస్తోంది. పురుషులలో ఉన్న అహంకారం, క్రోధం, ఈర్ష్యాదులచే స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, మానప్రాణాలు హరింపబడుతున్నాయన వచ్చు. ఈ కారణంగా చూస్తే ప్రపంచంలో స్త్రీలే పురుషుల కన్నా అధికంగా కష్టాలతో, బాధలతో జీవిస్తున్నారని చెప్పవచ్చు.

మానవ జాతిలోని ఒక సగభాగం రెండవ సగభాగాన్ని నిరంతరం అణచివేసే ప్రయత్నం చేస్తూ ఉందని చెప్పాలి. అణిచివేయబడ్డ స్త్రీలు, బాధపడ్డ స్త్రీలు, అవమానబడ్డ స్త్రీలు ఉత్తమ శిశువుకు, ఆరోగ్యవంతమైన

శిశువుకు ఎలా జన్మనివ్వగలరు? తమ తమ బాధలతో, కష్టాలతో సతమతమవుతూ చింతిస్తూ జీవిస్తున్న స్త్రీలు జీవితంలో ఏ విధంగా విజయం సాధించగలరు?

ఒక ఇంటి ఇల్లాలి దైనందిన జీవితాన్ని పరిశీలిస్తే తెల్లవారుజాము నుంచి రాత్రి పడుకునే ముందు వరకు ఒక యంత్రలా శ్రమిస్తూనే ఉంటుంది, జీవితంలో తన కంటు ఏ గమ్యంలేని మనిషిగా. తమ యావజ్జీవితం ఆ ఇంటికేధారపోస్తుంది. అయినా ఎపుడూ, ఏచోట, ఏ విధమైన గుర్తింపుకు నోచుకోదు. పురుషులు లేని సమాజం ఏవిధంగా ఊహించలేమో, స్త్రీలులేని సమాజాన్ని కూడా ఊహించలేము కదా? అలాంటపుడు స్త్రీలను పురుషుల కోసం సృష్టించబడ్డ బానిసలుగా చూడడం వంటింటికే పరిమితం చేయడం ఎంతవరకు సమంజసం.

స్త్రీవాద కవిత్వం ఆకలితో, అశాంతితో, దు:ఖంతో, అణిచివేతతో అతలాకుతలం అవుతున్న సంఘర్షణలోంచి స్త్రీల జీవితాలలో మార్పు తీసుకురావడానికి, పీడనలేని, లైంగిక వివక్షతలేని, అహంకారం, అసమానతలు చూపని ఆధునిక సమాజం కోసం దోహదపడుతోంది.

ఆధునిక స్త్రీవాద కవిత్వం 1980 నుంచి వచ్చినప్పటికీ, 1990లో త్రిపురనేని శ్రీనివాస్ ప్రచురించిన 'గురిచూసి పాడేపాట' ద్వారా బలం పుంజుకుని 1993లో అస్మిత వారి 'నీలిమేఘాలు' ద్వారా సూటిగా తన వాదాన్ని వినిపించింది. పురుషులకన్నా స్త్రీలే తమ వాదం గురించి మరింత లోతుగా, స్పష్టంగా చెప్పగలరని తెలియజేసింది.

'నీలిమేఘాలు' స్త్రీవాద కవితా సంకలనం ద్వారా వసంత కన్నాభిరాన్, ఓల్గా, విమల, జయప్రభ, సావిత్రి, శ్రీమతి, కొండేపూడి నిర్మల, మొక్కపాటి సుమతి, మందరపు హైమవతి వంటి రచయిత్రులు స్త్రీవాద కవిత్వాన్ని బలంగా వినిపించారు.

పెళ్ళిపేరుతో స్త్రీ ఏవిధంగా దోపిడీకి గురౌతుందో, ఒక ఆటబొమ్మగా మారుతుందో 'ఓల్గాగారి స్వేచ్ఛ' కవిత ప్రతిబింబించగా, 'సావిత్రిగారి బందిపోట్లు' కవిత పెళ్ళంటే పెద్దశిక్షగా-మొగుడంటే స్వేచ్ఛాభక్షకుడుగా చిత్రించగా, 'మొక్కపాటి సుమతి గారి మిత్రవైరుధ్యమా' అనే కవితలో వర్గ శత్రువు కన్నా లింగ శత్రువే ప్రమాదకారి అని చాటగా, 'విమలగారి వంటిల్లు' కవిత స్త్రీశక్తి దోపిడీని-పురుషాధిక్యతను స్పష్టం చేయగా, 'జయప్రభ గారి పైటను తగలెయ్యోలి' అనే కవిత స్త్రీలకు లేని ఎన్నో రకాల అలవాట్లను పైట నేర్పుతుందంటు సమాజంలో స్త్రీ స్వేచ్ఛ హరించే పైటను తగలెయ్యాలని సంచలనం సృష్టించింది. ఈవిధంగా ఎందరో కవయిత్రులు తమతమ పదునైన పరుష పదాల భావ జాలంతో సమాజాన్ని ప్రశ్నించడం వారికి జరుగుతున్న అన్యాయాలను ప్రస్తావించడం జరిగింది, ఇంకా జరుగుతోంది. అయితే కొన్ని కవితలు వివాదాలు సృష్టించడం, విమర్శలకు గురికావడం కూడా జరుగుతోంది.

## నిషిద్ధాక్షరి :

స్త్రీవాద భావజాలంతో బలమైన, మరింత పదునైన కవిత్వాన్ని 'నిషిద్ధాక్షరి' పేరుతో 2004లో సంపుటంగా వెలువరించారు కవయిత్రి 'మందరపు హైమవతి'గారు. ఈ కవితా సంపుటాన్ని పరిశీలిస్తే 43 కవితలున్న ఈ సంపుటం తరతరాలుగా స్త్రీలు అనుభవిస్తున్న వివక్ష, నరకయాతన, దోపిడీ, పురుషపీడన వంటి వివిధ అంశాలు కవితల రూపంలో ప్రతిధ్వనింపచేశారు.

మందరపు హైమవతిగారికి స్త్రీవాద కవయిత్రిగా గొప్ప గుర్తింపు తెచ్చిన రచన ఇది. "నిషిద్ధాక్షరి స్త్రీవాద తాత్వికత 'నేపథ్యంగా వచ్చిన కవితా సంపుటి', ఇందులో వారికి పేరు, బహుమతులు తెచ్చిన కవితలు అనేకం ఉన్నాయని, ఒకరకంగా హైమవతిగారిని స్త్రీవాద కవయిత్రిగా Establish చేసిన కవితా సంపుటి అది" అని 'కె.శివారెడ్డిగారు' 'నీలిగోరింట'కు రాసిన ముందుమాటలో అభిప్రాయపడ్డారు. "మందరపు హైమవతి కవితా ముద్ర తెలుగు స్త్రీవాద కవిత్వంలో చెరగనిది. తనదైన స్వరంలో స్త్రీ ఆర్తిని, ఆవేశాన్ని, ఆగ్రహాన్ని, ప్రేమనూ, ప్రేమ రాహిత్య జీవిత వేదనలను, ఆర్థిక సంబంధాల ప్రభావంతో ఛిద్రమవుతున్న స్త్రీ పురుష సంబంధాలనూ కవిత్వీకరించిన

అపురూప కవయిత్రి మందరపు హైమవతి” అని ఓల్గాగారు తమ అభిప్రాయాన్ని 'నీలిగోరింట'కు రాసిన ముందు మాటలో తెలిపారు.

నిషిద్ధాక్షరి కవితా సంపుటిని పరిశీలిస్తే కొన్ని ప్రధానాంశాలు ప్రస్ఫుటమవుతాయి అవి :

పితృస్వామ్యంలో బలియైన బాల్యం, ప్రేమ పేరుతో దగాపడ్డ స్త్రీ, పెళ్ళి పేరుతో బానిసైన స్త్రీ, నిషిద్ధజీవి-స్త్రీ, వ్యాపార వస్తువు - స్త్రీ, వృద్ధాప్యంలో స్త్రీ, సమాజం - పోరాటం - స్త్రీ, ఇలా అనేక కోణాల్లో స్త్రీల స్థితిగతులను గురించి చక్కగా కవిత్వీకరించారని తెలుస్తుంది.

పితృస్వామ్యంలో బలియైన బాల్యం- 'ఊపిరాడదు' అనే కవితలో

ఇంకా శరీరపుష్పం... వికసించనేలేదు సంపూర్ణంగా
అప్పుడే... చంకలో చంటిపిల్ల భారం...
ఏ ఇసుక తుఫానులోనో కూలిపోయిన
కలల ఖర్జూరవనం... ఏ దూరతీరాలకో
ఎగిరిపోయిన... బాల్యం తూనీగ...
పుత్తడిబొమ్మల... కౌమారాన్నపహరించడానికి...
ఏ శతాబ్దమైతేనేం.. పూర్ణమ్మల పున్నమి బతుకులకు...
పీడకలల మసి పూయడానికి...

పితృస్వామ్యం సదా సిద్ధం... అంటూ పసితనం వసివాడకముందే విద్యకు దూరం చేసి పెళ్ళి పేరుతో వారి కలల ప్రపంచాన్ని కూలదోసి వంచనతో బానిసగా వారిని మారుస్తున్న వైనం కనపడుతుంది. పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీలను కనీసం ఒక మనిషిగా కూడా చూడక పోవడం కనిపిస్తుంది. శతాబ్దాలు మారిన ఆడపిల్లల తలరాతలు మారడంలేదు. నేటికీ కొన్ని చోట్ల వారి పట్ల వ్యవహరిస్తున్న తీరు చాలా గర్హనీయం.

'జాగ్రత్త! జాగ్రత్త!!' అనే కవితలో

చిన్నప్పుడు... సింద్‌బాద్ సాహసయాత్రలు...
గలివర్ ప్రయాణగాథలు... చదివినపుడు...
ఎన్ని కలలు కన్నాను... నేనూ ఒక సాహసగీతాన్ని కావాలని...
కానీ పెద్దయ్యాకగదా తెలిసింది... సింద్‌బాద్‌లు గలీవర్‌లు... బాలురకు ఆదర్శమూర్తులని
సిండ రెల్లాలు స్నోవైట్‌లు... బాలికలకు ఆరాధ్య దేవతలని.... అంటూ బాలురను మాత్రం సాహస

వీరులుగా తీర్చిదిద్దే క్రమం, బాలికలకు బాల్యం నుండే సుకుమారిగా, అశక్తురాలుగా మార్చే ప్రయత్నం చేయడం, పదేపదే ఆడపిల్లవి, అబలవి అంటూ దండకాలు చదివి వారిని వీలైనంత బలహీన పరచడానికే ఈ సమాజం ప్రయత్నిస్తుందంటు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రేమ పేరుతో దగాపడ్డ స్త్రీ - 'మరో తాజ్ మహల్' అనే కవితలో

శరీర సహకారగానంతో... సజావుగా నడిచిన ప్రేమగాథ...
స్వీయనిర్ణయ ప్రకటన చేయగానే... భావోద్వేగ సన్నివేశాల్లో...
హఠాత్తుగా వాణిజ్య ప్రకటన...
ప్రత్యక్షమైనట్లు... దృశ్యం మారిపోతుంది...
ప్రణయ మండపంలాంటి... ప్రేయసిగుండెల్లో...
కరకు కత్తిపోట్లనే... కానుకగా యిచ్చి... బ్రతికుండ గానే...

మరో తాజ్‌మహల్ నిర్మిస్తాడు... అంటూ కొందరు స్వార్థ పురుషులు తమ ఆనందం, శారీరక సుఖాల కోసం అమ్మాయిలను ఏవిధంగా ప్రేమపేరుతో బలితీసు కుంటారో అలాగే ఈ ప్రపంచంలో ప్రేమించడానికి అడ్డురాని సామాజిక, సాంఘిక, ఆర్థిక అంశాలెన్నో పెళ్ళి అనగానే పుట్టుకువచ్చి బ్రతికుండగానే మరో తాజ్‌మహల్ నిర్మిస్తాడని తెలియజేశారు.

ఒకవేళ పెళ్ళి చేసుకున్న తరువాత పరిణమించే స్థితి, పరిస్థితి గురించి కూడా కవయిత్రి

'కవిగారి భార్య!' అనే కవితలో ...

పెళ్ళికి ముందు ప్రేయసిగా ఉన్నప్పుడు కనిపించిన

ప్రతిదాన్ని కవిత్వీకరించాలని వెఱ్ఱి తపన పెళ్ళయ్యాక ఉండదెందుకనో... అంటారు.

పెళ్ళి పేరుతో బానిసైన స్త్రీ - 'సర్ప పరిష్వంగం' అనే కవిత మందరపు హైమవతిగారికి బాగా పేరు తెచ్చిన కవితలలో ఒకటి. ఇందులో పెళ్ళి తరువాత భార్య భర్తకు డబ్బు సంపాదించే ఒక మరమనిషిగా, ఒక బానిసగా, చిత్రించడం జరిగింది.

'అంతా బాగానే వుంటుంది... అప్పటివరకు...
కామంతోనైతేనేమి... మోహంతో నైతేనేమి...
ఇరువురి తనువులొక్కటైనాక... అద్వైత సిద్ధి పొందినాక...
ఒక ప్రశ్నల బాణం సంధిస్తావు... "జీతమెప్పుడిస్తారు"... ఆమాటతో
ఒక్కసారిగా వేయి రాక్షస బల్లులు మీద పాకినట్టు...
నా జీవితం నుంచి దూరంగా సుదూరంగా విదిలించివేయాలనుకుంటాను నిన్ను...
కానీ భారత స్త్రీనైనందుకు సంప్రదాయాల సజీవ సమాధిలో
ఊపిరాడక గిలగిల కొట్టుకుంటూ...

మృత్యుపర్యంతం బ్రతికేస్తూనే వుంటాను నీ సర్ప పరిష్వంగంలో...అని ఎంతో హృద్యంగా కవిత్వీకరించారు హైమవతిగారు.

'కవిగారి భార్య!' అనే కవితలో ... పెళ్ళి తర్వాత భార్యగా డి-మోషన్ వచ్చాక

ఇంటి చాకిరి భూతపు కోరల్లో చిక్కుకొని... 'పిల్లలకు ఆయాగా, నర్సుగా, టీచరుగా...
వండడం, వడ్డించడం, కడగడం, తోమడం - చర్విత చర్వణాలై జీవిత సౌఖ్యాన్ని వంచించినపుడు'....
కవితా రంగంలో ఎలాగైనా నా పేరు నమోదు చేసుకోవాలని కలం పట్టగానే ... దారుణంగా విసుక్కొంటావు నువ్వు ....
ఇక నేనెప్పటికీ కమలాదాసును కాలేను... నేనిప్పుడు కవిగారి భార్యను మాత్రమే... అంటూ స్త్రీల దయనీయ బానిసతత్వాన్ని ప్రకటిస్తుంది కవయిత్రి.

సర్దుకుపో! అనే కవితలో పెళ్ళైన స్త్రీ అత్తారింటిలో అన్నింటికీ సర్దుకుపోవాలమ్మా! సర్దుకుపోవాలి! అంటూ భర్త చెడ్డవాడైనా, వ్యసనపరుడైనా పెళ్ళయిన దగ్గర్నుంచి ఆలోచనలకు అష్టదిగ్బంధనాలు, అభిరుచులకు స్వస్తివాక్యాలు చివరికి తన శరీరంపై తనకే హక్కులేదంటు విధించే ఆంక్షలతో నేను మనిషినేనా? అనే సందేహం కలుగుతుందంటు... ప్రపంచమంతటికీ స్వాతంత్ర్యం వచ్చినా నేనింకా బానిసత్వం అంధకారంలో మగ్గిపోవలసిందేనా? అని ప్రశ్నిస్తుంది.

నిషిద్ధజీవి-స్త్రీ- సిలబస్ మార్చలేమా! కవితలో

అబ్బ! ఇక చాలు ఆపండి
మీ నీతి శాస్త్ర వ్యాఖ్యానాలు
నిషిద్ధ సూత్ర ప్రవచనాలు...
సమయం దొరికిందే చాలని.... మనువు నుండి ఆధునికులవరకు...

నా మీదే ప్రయోగిస్తారు..... నిషేదాస్త్రాలను, సుభాషితాలను.... అంటూ తరతరాలుగా ప్రతిచోట, ప్రతి సందర్భంలోనూ ఆడవాళ్ళకు మాత్రమే అన్నట్లుగా చెప్పే నీతి సూత్రలు వినివిని స్త్రీ జీవిత ప్రయాణంలో అడుగడుగునా నిషిద్ధమే కన్పిస్తుందని, మంచి భార్యగా ఉండమని చెప్పే సమాజం, మంచి భర్తగా తనను ఉండమని కనీసం ఒక్కసారైనా మాటవరుసకైనా చెప్పరే ...

జన్మించిన దగ్గర్నుంచి... కొంచెం కొంచెం విషం పెట్టి...
విషకన్యలుగా మార్చినట్లు... కన్ను తెరవకముందే ...
బానిసత్వభావాలు తనలో నిక్షిప్తం చేశారని...

మనసును గుర్తించలేని పాతకాలపు భావాలు గల ఈ జీవిత సిలబస్ మార్చలేమా? అని ప్రశ్నిస్తుంది.

'నిషిద్ధాక్షరి' అనే కవితలో లింగ నిర్ధారణ పరీక్షలో ... ఆడపిల్లనని తెలిసాక...

సామ్రాజ్యాలు కోల్పోయినట్లు... మూడో ప్రపంచ యుద్ధమేఘాలు ముసురు కొన్నట్లు...

అలా దిగులు ముఖం వేలాడదీస్తావెందుకు... నా ఊపిరి ప్రాణాన్ని గాలిలో కలిపేయాలనుకొంటావెందుకు... అంటుంది.

ఆధునిక సాంకేతికత పెరిగి లింగ నిర్ధారణ పరీక్షలు సాధారణమైపోయి చాలా ప్రాంతాల్లో ఆడపిల్ల అని తెలిసాక ఆదిలోనే వారి ఆయువు తీసిన సంఘటనలెన్నో మనం చూశాం, చట్టాలు ఎన్ని వచ్చినప్పటికీ ఇంకా అక్కడక్కడ ఈ కిరాతక చర్యలు జరుగుతూనే మనిషిలోని మానవత్వానికి మసిపూస్తున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే అమ్మ, అక్కా, భార్య ఉండదని సమాజాన్ని జాగృతం చేస్తారు.

ఎవరి కలుగుల్లోకి... కవితలో

వెళ్ళక పోతేనేం... నిషేద దండంతో ... టక్కున దిగ్గొడతారు... నెత్తిన మేకు...అంటూ స్త్రీలు బయటికి పంపడానికి ఎన్నో నియమాలు, నిషేదాజ్ఞలతో కట్టుకున్న మొగుడైనా.... తోడబుట్టిన సోదరుడైనా....సంకెళ్ళను భద్రంగా బిగించి...

పంజరాల ఊచలమధ్య... ఖాళీలను మరింత పూడ్చాలనుకొంటారని... అయినా అతి కష్టంమీద నాలుగు గోడల మధ్య నుంచి బయటకు వచ్చి జీవితానికి సరిపడా ఆనందం హృదయంనిండా నింపుకొని సరికొత్త జన్మనెత్తి, ప్రాణవాయువు నింపుకొన్నాక మళ్ళీ ఎవరి కలుగుల్లోకి వాళ్ళు వెళ్ళపోవడమే.

వ్యాపార వస్తువు-స్త్రీ - 'మనకేం మనం బాగానే వుంటాం'ఈ కవితలో

ఇప్పుడు ఇక్కడ... తల్లీ చెల్లీ అక్కా... భార్యా ప్రేయసీ ... అందరూ విపణి పస్తువులే ... అంటూ ఆధునిక సాంకేతిక యుగంలో స్త్రీలను ఒక వ్యాపార వస్తువును చేసి అంగడి బొమ్మగా మార్చేసిన వైనాన్ని ఆవిష్కరించారు.

అమ్మాయిలు కావలెను- కవితలో

సౌందర్య ప్రదర్శనల్లో ... వాణిజ్య ప్రకటనల్లో...
శరీరాన్ని పెట్టుబడిగా మార్చి...
బుల్లితెరపై వెండితెరపై... సోయగాలను విరజిమ్ముతూ...అమ్మాయిలే కావాలి...
ఆకలి బకాసురునికో... కరువు రక్కసి కోరలకో ... చిక్కిన అమాయకులను ...
ఉపాధి కల్పిస్తామని... ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేసి ... వక్షోజాల జఘనాల...
అవయవ ప్రదర్శనశాలల... దేహాలకు వెలకట్టి వేలం పాట పాడి...
వ్యాపారం చేయడానికి అమ్మాయిలే కావాలి...
ఔను !... యత్రనార్యస్తు పూజ్యంతే... తత్ర దేవతా రమంతే...

అని స్త్రీలను సంభావించే దేశంగదా మనది ... అని వ్యంగ్య ధోరణిలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాన్ని తేటతెల్లం చేస్తారు.

వృద్ధాప్యంలో స్త్రీ - తల్లి పిల్లలను కంటికి రెప్పలా రక్షిస్తూ పెంచి పెద్దవారిని చేసే క్రమంలో ఎన్నో అవాంతరాలను దాటుతుంది, చివరికి నిద్రాహారాలు మాని తన ప్రాణాన్ని కూడా లెక్కచేయక తన ఆరోగ్యం పాడు చేసుకుంటుంది. ఇంతా చేస్తే పెద్దవారైన తన కన్నబిడ్డలే వృద్ధాప్యంలో తల్లిని పనికిరాని వస్తువుగా చూసే స్థితిని 'నేనొక పసిపాపనై' కవితలో

పాత గుడ్డల మూటలా... పనికిరాని చిత్తు పుస్తకంలా...
ఎవరికీ అక్కరలేని వ్యర్థ పదార్థాన్ని నేను...

వార్థక్యం శరీరాన్ని శిథిలం చేసినట్లే... మనస్సును గూడ శిథిలం చేస్తే ఎంతబాగుండు... అంటూ ఆమె హృదయం ఆలపించే ఆర్తనాదాన్ని తెలిపారు.

సమాజం - పోరాటం - స్త్రీ - ఆనాటి నుండి ఈనాటి వరకు సమాజంలో స్త్రీలు ఎదర్కొంటున్న సవాళ్ళు అన్నీ ఇన్నీ కాదు. ఈ ఆధునిక సమాజంలో కూడా ఒకప్రక్క స్త్రీలు అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగాలు చేస్తు ఎదుగుతున్న మరోప్రక్క అడుగడుగునా ఆడవారిని అబలలుగా చూస్తూ అవమానిస్తూ, అవహేళన చేస్తూ, ఆత్మాభి

మానానికి మారుగా అహంకారం అంటగడుతున్నారు. పుట్టి బుద్దెరిగిన తరువాత నుంచి ఇంటా బయటా, విద్యా, ఉద్యోగాల్లో, సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక రాజకీయాలలో సూటిపోటి మాటల్తో చిత్రవద చేస్తూనే ఉంది ఈ సమాజం.

ఈ దృక్కోణంతో రాసిన కవిత 'నువ్వు - నేను'.

సమాధానం చెప్పినందుకే... ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళను...
పొగరు బోతులంటావు... నిర్భయంగా నిజం పలికినందుకే...
నిష్ఠూరాల నిప్పుకణికెలు గుప్పిస్తావు...రాత్రిళ్ళు ఆలస్యాల రాకల గురించి ....
ప్రశ్నార్థకమైనందుకు... నన్నోక రాకాసిని చేస్తావు...

ఆడవాళ్ళు ఒక అడుగు అటేసినా, ఒక అడుగు ఇటేసినా తప్పుబట్టే సమాజంలో కొందరు పురుషుల ఆధిపత్యానికి, అహంకారానికి కన్నీరు కారుస్తున్న మహిళల ఆక్రంధన నేటికీ వినిపిస్తూనే ఉందని కవయిత్రి మందరపు హైమవతి గారు విదిశపరిచారు ఈ నిషిద్ధాక్షరిలో.

నేటికీ సమాజంలో నిర్భయ, గృహహింస, దిశ, వంటి ఎన్ని చట్టాలు చేసినా, మరెన్నో ఆస్తి హక్కు వంటి హక్కులు కల్పించినా, ఆడవాళ్ళ పట్ల మగవాడి తీరులో మార్పు రానంత వరుకు, సమాజంలో మార్పురానంత వరకు ఇలాంటి పదునైన కవిత్వాలు వెలువడుతూనే ఉంటాయి మనిషిలోని మానవత్వాన్ని తట్టి లేపేందుకు.

భావవీణ

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

April 2021

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253
UGC Care List Group - 1
Journal under Arts and
Humanities Category




Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.